# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 07 జనవరి 2023


## జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలు విడుదల



**పులివెందుల రూరల్, జనవరి 6, ప్రభాతవార్త :**

పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో 2022 నవంబరు / డిసెంబరు నెలలో నిర్వహించిన బీటెక్ మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ (ఆర్20) మరియు బీటెక్ మొదటి, ద్వితీయ, తృతీయ, ఫైనల్ ఇయర్ మొదటి సెమిస్టర్ (ఆర్15) మరియు (ఆర్19) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జివిఎస్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ పరీక్షలకు 355మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 318మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 89.58శాతం ఫలితాలు సాధించారన్నారు. ఈ ఫలితాలను కొద్ది సమయంలోనే విడుదల చేసేందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన ప్రొఫెసర్ త్యాగరాజన్, డాక్టర్ రాధాక్రిష్ణలను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ అభినందించారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందు పరిచామని విద్యార్థులు పరీక్ష ఫలితాలు తెలుసుకోవచ్చున్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపల్ జివిఎస్ రాజు, వైస్ ప్రిన్సిపల్ ఆర్.రమణారెడ్డి, పరీక్ష కేంద్ర విభాగాధిపతులు అభినందించారు.

## ప్రమాదం ఉందని తెలిసినా పట్టించుకోరా..?

**చిట్వేలి, జనవరి 6 ప్రభాతవార్త**



చిట్వేలి - రాపూరుకు వెళ్లే రహదారిలో ఆంజనేయస్వామి దేవాలయం సమీపాన వర్షపునీరు వెళ్లేందుకు నిర్మించిన కల్వర్టు గోడ పూర్తిగా కూలిపోవడంతో పెద్ద లోయ ఏర్పడింది. దగ్గరగా వెళితేగాని అక్కడ ఇబ్బందిని గమనించలేని పరిస్థితి. భారీ వాహనాలు అటువైపు వెళితే రోడ్డు క్రుంగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలవాటుగా తిరిగే వాహనదారులకు తప్ప కొత్తవారికి అక్కడ ఉన్న ఇబ్బంది తెలియదు. గతంలో ప్రభాతవార్త ద్వారా 'కూలిన కల్వర్టు గోడ.. ఆదమరిస్తే ప్రమాదమే' అని వార్త రూపంలో విషయాన్ని తెలియపరిచినా ఆర్ అండ్ బి అధికారులు స్పందించకపోవడం, విషయాన్ని చిన్నదిగా చూడం చూడడం పలు విమర్శలకు దారితీస్తుంది. అధికారులు తక్షణమే స్పందించి గోడ నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ఏపీపీఎస్సీ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

### డిఆర్వో గంగాధర్ గౌడ్



**కడప, జనవరి 6 ప్రభాతవార్త :**

ఈ నెల 8న జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఏపిపిఎస్సి గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ విసి హాలులో.. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై... డిఆర్వో గంగాధర గౌడ్.. ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు ఎన్. ప్రమీల (అసిస్టెంట్ సెక్రెటరీ, మానిటర్), సి.హెచ్. వి. సాయి ప్రకాశ్ (సెక్షన్ ఆఫీసర్) లతో కలిసి పరీక్షల విధులు కేటాయించిన లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం.. ఈ నెల 8వ తేదీ (ఆదివారం)న రెండు సెషన్లలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కోవిడ్ నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరువైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు.

**ఏపీపీఎస్సీ గ్రూప్-1 కంట్రోల్ రూమ్ ఏర్పాటు..**

పరీక్షా కేంద్రాలకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే.. జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 కంట్రోల్ రూమ్ నెం. 08562-246344 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం నుండి 8వ తేదీ మధ్యాహ్నం వరకు ఈ కంట్రోల్ రూం నిర్వహణలో ఉంటుందన్నారు.

## నాడు-నేడు ఫేస్-2 పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయండి

### జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ






**కడప, జనవరి 6 ప్రభాతవార్త :**

నాణ్యతను పాటిస్తూ మనబడి నాడు నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కొత్త కలెక్టరేట్ లోని సభా భవన్ లో మనబడి నాడు నేడు ఫేస్-2 పనుల పురోగతి పై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ మనబడి నాడు నేడు రెండవ దశలో భాగంగా రూ.288 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 998 పాఠశాలలు, 9 జూనియర్ కాలేజీలలో చేపట్టిన పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపాలు వుంటే సంబంధిత అధికారుల పైన చర్యలు తప్పవని అన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి, ఇంజనీరింగ్ అధికారి ఎప్పటికప్పుడు ప్రతి పనిని తనిఖీ చేస్తూ నివేదికలందించాలని తెలిపారు.అలాగే ప్రతి పాఠశాలకు సంబంధించిన టాయిలెట్స్, త్రాగునీరు , విద్యుదీకరణ, లైట్స్, మేజర్ అండ్ మైనర్ రిపైర్స్, కాంపౌండ్ వాల్సు, అదనపు తరగతి గదులు కిచెన్ షెడ్ సంబంధించిన పనులు ఎప్పటికప్పుడు గ్రామ, వార్డు సచివాలయం ఇంజనీర్స్ ఫొటోస్ ద్వారా ఆన్లైన్లో ఎస్ టి ఎం ఎస్ లో నమోదు చేసి వాటి పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికే మన జిల్లాకు రూ56.08 కోట్లతో రివలింగ్ ఫండ్ రూపంలో విడుదల అయ్యాయని దీనికి సంబంధించి రూ.51.87 కోట్లు ఖర్చు చేసామని మిగిలిన మొత్తం కూడా మరో వారం రోజులు లోపల పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మనబడి నాడు నేడు ఫేస్-1లో వైఎస్ఆర్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాల్లో వుంటే ప్రస్తుతం నాడు నేడు ఫేస్- 2లో కూడా మంచి ర్యాంక్ కనపరచాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి వారం విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష ఉంటుందని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తెలిపారు. సమగ్ర శిక్ష పిడి అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ఎక్స్పెండిచర్, సెంట్రలీ ప్రోక్యూర్మెంట్ మెటీరియల్స్, ఎలక్ట్రికల్ సామాగ్రి, శానిటరీ వేర్ కు సంబంధించిన ఇన్వాయిసులు, బిల్లులు ఎప్పటికప్పుడు ఎస్టీఎంఎస్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చెప్పలి దేవరాజు, పంచాయతీరాజ్ సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్ శ్రీనివాసుల రెడ్డి , ఆర్డబ్ల్యూఎస్ సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ వీరన్న, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకర్ రెడ్డి సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, మండల ఇంజనీర్లు, మండల విద్యాశాఖ అధికారులు సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న లేఔట్‌లలోని 22వేల ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

**-లక్ష్యసాధన విధులలో నిర్లక్ష్యం వహించిన ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల సస్పెన్షన్‌కు ఆదేశాలిచ్చిన కలెక్టర్**

**-జిజిఎంపిలో మంజూరయిన పనుల బిల్స్‌ను వెంటనే ఆన్‌లైన్ చేయండి**

**-జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్**

**రాయచోటి.జనవరి 06 ప్రభాతవార్త**



నవరత్నాలు పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఉగాదిలోపు జిల్లాలోని జగనన్న లేఔట్‌లలో చేపట్టిన 22229 ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపిడివోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ మాట్లాడుతూ పేదవాడికి సొంతింటిని కల్పించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహ నిర్మాణాలు చేపట్టింది. ఇండ్ల నిర్మాణాలను ప్రతి వారం ఖచ్చితంగా దశలవారిగా స్టేజ్ కన్వర్షన్ జరగాలని సూచించారు. వారంలో మూడు రోజులు ఎంపిడివోలు, హౌసింగ్ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి కేటాయించిన లక్ష్యంలో ప్రగతి సాధించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత లేఔట్‌లలోని ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయడంలో భాగంగా ఆయా నియోజక వర్గాలలో ప్రారంభించిన ఇండ్లకు వెంటనే వందశాతం మ్యాపింగ్, జియో ట్యాగింగ్ పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని డిఇలు, ఏఈలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణాలకు సంబందించి అవసరమైన వారందరికి ఎస్‌హెచ్‌జిల ద్వారా రుణాలు ఇప్పించే కార్యక్రమాన్ని వేగవంతం చేసేలా డిఆర్డిఏ, ఏపిఎం, ఆర్పిలు సమన్వయంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని డిఆర్‌డిఏ పిడి తగిన పర్యవేక్షణ చేయాలన్నారు. గృహ నిర్మాణంలో ఇచ్చిన లక్ష్యాలను సాధించడం, ప్రగతిలో వెనుకబడడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం, వారం వారం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయలేక పోవడంతో వాల్మీకిపురం, రామాపురం గృహనిర్మాణ శాఖ ఏఈలు, సుబ్బారెడ్డి, కెఎన్ఎం ప్రసాద్, రామసముద్రం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ హౌసింగ్ పీడిని ఆదేశించారు. అలాగే పీలేరు. కోడూరు మండలాలలో గృహ నిర్మాణాలు ప్రగతిలో తగిన పర్యవేక్షణ చేయకపోవడంతో వాల్మీకిపురం, పీలేరు, కోడూరు ఎంపిడిఓలుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. మంజూరు చేసిన పనులకు సంబందించిన బిల్స్‌ను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఎంపిడివోలకు కలెక్టర్ సూచించారు. ఆయా నియోజవర్గాలలో ఇప్పటికే గ్రౌండింగ్ చేసిన పనులను త్వరిగతిన పూర్తి చేసి పెండింగ్ బిల్స్‌ను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి శివయ్య, సిపిఓ కృష్ణ నాయక్, ఏడి వెంకటేష్, డిఆర్ఎ పిడి నారాయణ, ఎంపిడివోలు, గృహ నిర్మాణావఖ డీఈలు, ఈఈలు, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## దొంగనోట్లు స్వాధీనం ....నిందితులు అరెస్ట్



**దువ్వూరు, జనవరి 6, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కానగదూరు గ్రామంలో పూలమండీ వద్ద దొంగ నోట్లు చెలామణి చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారిని కోర్టుకు తరలించినట్లు మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దువ్వూరు మండలంలోని కానగూడూరు పూల మార్కెట్ వద్ద శుక్రవారం ఉదయం మాచర్లకు చెందిన పేర్ల ఏసయ్య, గంగవరం సాగర్‌రెడ్డి, గిద్దలూరుకు చెందిన కోటేశ్వరరావులు పూలమండీ వద్ద రూ.200, రూ.500 నకిలీ నోట్లు మార్చేందుకు ప్రయత్నిస్తుండగా మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, ఎస్సై రాఘవేంద్రరెడ్డిలు, క్రైం బ్రాంచ్ సిబ్బంది అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి 59 రూ. 200 దొంగనట్లు, అలాగే ఒక వైపు ముద్రించిన రూ.500 దొంగనోట్లు, 3 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, ల్యామినేటర్, పేపర్ కటింగ్ మిషన్ ఏకే కంపెనీకి ఎక్సల్ బాండ్‌పేపర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒకరు పరారీలలో ఉన్నాడని అతన్ని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు. ఈ కేసులో పాల్గొన్న సీఐ, ఎస్సై, క్రైం పార్టీ సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ అభినందించినట్లు తెలిపారు. ముద్దాయిలను కోర్టుకు తరలించామని అనంతరం వీరి వెనక ఎవరైనా ఉన్నారని కష్టడీకి కోరతామని పేర్కొన్నారు.

## వైసిపిని ప్రజలు తిరస్కరించే రోజులు దగ్గర పడ్డాయి

### టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి

**ప్రొద్దుటూరు, జనవరి 6 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు అధిక ధరలకు ప్రజలు విసిగి వేసారి పోయారని జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించే రోజులు దగ్గరపడ్డాయని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసులు రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని తొమ్మిదో వార్డులో టిడిపి ఇన్చార్జ్ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. సంక్షేమం ముసుగులో నిత్యవసర ధరలు గ్యాస్ డీజీలు కరెంటు బిల్లులు తదితర వాటి ధరలను పెంచి పేదలపై మోయలేని భారం మోపిందని తెలిపారు రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేసి జైల్లో పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేవలం టిడిపి అధినాయకుల పర్యటనలను అడ్డుకునేందుకే ప్రజా స్పందన చూసి ఓర్వలేక మతిభ్రమించి జీవో నెంబర్ 1 తీసుకొచ్చారని విమర్శించారు. ఇలాంటి అరాచక ప్రభుత్వాన్ని ఎందుకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడ్డాయని తక్షణం గుర్తించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులకే దిక్కులేదు 175 కు 175 సీట్లు గెలుస్తావా అని నిలదీశారు. రాబోయే రోజులలో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించే రోజులు దగ్గరపడ్డాయని వచ్చేది టిడిపి ఆయన జోష్యం (మిగతా IIవ పేజీలో)

## ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డులు

### నిమిషాల వ్యవధిలో తొలగింపులు

**పీలేరు, జనవరి 6 ప్రభాతవార్తః**



ఇది ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నిమిషాల వ్యవధిలోనే ఏర్పాటు చేసిన బోర్డులు తీసేశారు. పీలేరులో శుక్రవారం జరిగిన ఈసంఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ పరిధి సర్వే నెంబరు 200-3లో పీలేరు పట్టణం శివారు ప్రాంతం తిరుపతిరోడ్డు మార్గంలో ఉంది. ఇక్కడ ఎకరా రూ.4కోట్లు వరకు ధర పలుకుతోంది. ఇదే సర్వే నెంబరు 0.53 ఎకరాల ప్రభు త్వ భూమి ఉంది. ఈభూమిలో కొందరు కొన్ని రోజులుగా చదునుచేసే కార్య క్రమాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు వెంచర్లు వేసే ప్రాంతానికి వచ్చి ఇది ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయగా నిమిషాల వ్యవధిలో అది మాయమైపోయింది. ఈసంఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ డీకేటీ భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబో మని తహశీల్దారు అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగిం చిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## గ్రామాలవారిగా ప్రభుత్వ భూములు గుర్తించాలి

**-ఎస్సీ, ఎస్టీ కాలనీలలో స్మశానవాటికలకు స్థలాలు గుర్తించాలి**

**రాయచోటి.జనవరి 06 ప్రభాతవార్త**

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా, సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ సంబందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రీ సర్వే, భూసేకరణ ఎస్సీ, ఎస్టీ కాలనీలలో స్మశాన వాటికలకు స్థలాల గుర్తింపు, తదితర అంశాలపై ఆర్డివోలు, తహశీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సర్వే పక్కాగా పటబ్బందీగా చేపట్టాలన్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్డివోలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పకడ్బందీగా చేయకపోతే రెండవ సారి చేయాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేకు సంబందించి రైతులందరికి అవగాహన కల్పించాలన్నారు. అన్నమయ్య జిల్లాలోని 30 మండలాలో రీ సర్వేకు సంబందించి ఎక్కడా కూడా ఎటువంటి సమ్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులుకు సూచించారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పేదలకు భూ పంపిణీ చేసేందుకు ప్రతి మండలంలో తహశీల్దార్‌లు మినిమం 100 ఎకరాలు ప్రభుత్వ భూమి గుర్తించి తమకు రిపోర్ట్ పంపాలన్నారు. ఈ భూమి ఎస్సీ, ఎస్టీ పేదలకు పంపిణీ చేయడం జరగుతుందని ఇందుకు సంబందిచి ఇప్పటి వరకు గుర్తించిన ప్రభుత్వ భూమి, ఎస్సీ, ఎస్టీ అర్హుల జాబితా వెంటనే తమకు పంపాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూమి ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ఆర్డివోలు, తహశీల్దార్‌లకు సూచించారు. బరియల్ గ్రౌండ్‌లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు వెంటనే స్మశాన వాటిక స్థలాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణాలకు సంబందించి ఫారెస్ట్ ల్యాండ్‌ను గుర్తించాలన్నారు. కోర్టు కేసులను జాగ్రత్తగా పరిశీలించి బాధితులకు నోటీస్‌లు జారీ చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డివోలు రంగస్వామి, కోదండరామిరెడ్డి, మురళీ, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజ్, తహశీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ శాఖలో ఆకలి కేకలు

**- రుచికరం లేని భోజనం - 60 మంది విద్యార్థులకు 6 మంది హాజరు**

**- జేబులు నింపుకుంటున్న హాస్టల్ అధికారులు**

**ఓబులవారిపల్లె, జనవరి 6, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన ఓబులవారిపల్లె సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో రోజు రోజుకు ఆకలి కేకలు ఎక్కువవుతున్నాయి. అదే తరహాలో రుచికరమైన భోజనం వడ్డించడం లేదని ఆరోపిస్తున్నారు. 60 మంది విద్యార్థులుండగా అందులో 6 మందికి మాత్రమే భోజనం వడ్డిస్తూ మిగిలిన వారికి హాజరు వేసి వారికి చెందాల్సిన ఆహారంలోని నిధులను స్వాహా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ వార్డెన్ నిర్వాకంతో హాస్టల్‌లో విద్యార్తులు లేకున్నా ఉన్నట్లు హాజరు పట్టిక చూపి వారికి ప్రతి రోజూ మెనూ ప్రకారం ఆహారపు వస్తువులను విక్రయించి పిల్లల కడుపు కొడుతూ జేబులు నింపుకుంటున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. విద్యార్థులను హాస్టల్‌కు పిలిపించి వారికి వసతి కల్పించి హాస్టల్‌పై మక్కువ చూపాల్సిన అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ అడిగిన వాటికి విరుద్ధపు సమాధానాలు ఇచ్చి కాలం గడుపుతున్నట్లు విద్యార్తుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యార్థులు హాస్టల్‌కు వచ్చి హాస్టల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి మెరుగైన వసతులు, రుచికరమైన భోజనం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

- **కదిలిన రెవెన్యూ యంత్రాంగం**
- **ఆర్డీవో ఆదేశాల మేరకు భూములు సర్వే**
- **తీగ లాగితే డొంక కదిలింది..**
- **భూముల సర్వేపై నివేదికలకు ఆదేశించిన తహసీల్దార్ పీర్మున్నీ**



**ఓబులవారిపల్లె, జనవరి 6, ప్రభాతవార్త:**

భూ ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగం ఆగ్రహించింది. భూ అక్రమార్కులపై కొరఢా ఝుళిపించేందుకు రంగం సిద్ధమైంది. నిబంధనలకు తిలోదకాలిస్తే ఉపేక్షించేది లేదని ముక్కుసూటికి తెలిపింది. ఇబ్బందిముబ్బడిగా భూములను ఆక్రమించి అన్యాక్రాంతం చేస్తే ఉపేక్షించేది లేదని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, అంగ బలం ఉన్న వారు ఖాళీ భూములపై కన్నేశారనే చెప్పవచ్చు. ఈ భూములను ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు. ఈ నిర్వాకాన్ని ఆదిలోనే అంతం చేసి ఉంటే గతంలో ఉన్న అధికారులు ఈ పరిస్థితి ఉండేది కాదని ప్రస్తుత విధులు నిర్వహిస్తున్న అధికారులు అంటున్నారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా పై అధికారుల సూచనల మేరకు ఈ పరంపరలో భాగంగానే ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు గ్రామ రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 2204లో ఉన్న 1100 ఎకరాల భూములు గతంలో పలువురికి ప్రభుత్వం నుంచి పట్టాలు అందాయి. అదే తరహాలో కొంత మంది భూ ఆక్రమణదారులు బినామీ పేర్లతో ఒక్కొక్కరు 10 ఎకరాల నుంచి 50 ఎకరాల వరకు బోగస్ పత్రాలు సృష్టించి యథేచ్ఛగా, యమ దర్జాగా భూములు ఆక్రమించి చదును చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆక్రమించిన వారు పైకి పెద్దమనుషులుగా ఉంటూ ఎక్కడ ఖాళీ స్థలాలు దొరికినా ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. గతంలో ఉన్న కొందరు రాజకీయ పలుకుబడి ఉండి తీవ్ర రాజకీయంగా పదవులు అనుసరించిన వారు 20 నుంచి 40లక్షల రూపాయల వరకు భూములను వేరే ప్రాంతాల వారికి విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఈ భూ ఆక్రమణల దందా ఎక్కువగా జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న తహసీల్దార్లు ఇదే సర్వే నెంబర్లలో సబ్ డివిజన్ చేసి పట్టా పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ చేసి సొమ్ము చేసుకున్నారని పలువురు అంటున్నారు. ఏది ఏమైనా తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఒక సర్వే నెంబరును హద్దుగా తీసుకొని సర్వే చేస్తే వందల ఎకరాల్లో భూములు ఆక్రమించినట్లు తేటతెల్లం అయినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈ భూ సర్వేలపై రికార్డులు, భూములు పరిశీలిస్తే అధికారులకు నివ్వెరపోయే నిజాలు తేటతెల్లమైనట్లు తెలుస్తోంది. ఈ భూములకు చెందిన సర్వే పూర్తయిన తరువాత ఎవరికి పట్టాలు ఇచ్చారు, ఎవరు అర్హులు, పేదలెందరున్నారనే వారి వివరాలు సేకరించి అర్హులై బూములు సాగు చేసుకుంటే వారికి జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందించి ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలుంటాయని అధికారులు చెబుతున్నారు. అయితే బడా బాబులు ఎటువంటి రికార్డులు, పట్టాలు లేకుండా ఎకరాలకు ఎకరాలు ఆక్రమించి వారి స్వాధీనంలో ఉంటే వారి వివరాలు సేకరించి పై అధికారులకు నివేదికలు పంపుతామని వారి నిర్ణయం మేరకు చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఈ భూముల ఆక్రమణలపైన తహసీల్దార్ పీర్మున్నీని వివరణ కోరగా పెద్దఓరంపాడు రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 2204 లో దాదాపు 1100 ఎకరాల భూమి ఉందని మండలంలోనే ఒక బ్లాక్‌గా ఈ భూ సర్వే నెంబర్‌ను గుర్తించడం జరిగిందన్నారు. భూ రికార్డులు పరిశీలించి అర్హతను బట్టి పై అధికారులు వారికి శాశ్వత భూ హక్కు పత్రాలు మంజూరు చేయించడం జరుగుతుందని ఇంకా 2 రోజుల పాటు సర్వే చేసి వాటి అర్హతను బట్టి అధికారులకు నివే దిక పంపి కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## ఎన్నికల్లో హామీలు ఇచ్చేశాం...

**రోడ్లను పూర్తి పూర్తి చేశాం - వీధి ప్రజల అభినందనలు**

**రైల్వేకోడూరు రూరల్, జనవరి 6 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మండలంలో గత పంచాయతి ఎన్నికల్లో వినాయకనగర్ నుండి చందనం తోట వరకు సిమెంట్‌రోడ్లకు హామీలు ఇచ్చామని వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయిల ఆధ్వర్యంలో దాదాపు 30 లక్షల రూపాయల పనులను ఉపాదిహామి పథకం ద్వారా రోడ్లను విజయవంతంగా పూర్తి చేశామని రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో మట్టిరోడ్లను కనపడనీయకుండా పూర్తి స్థాయిలో సిమెంట్‌రోడ్లను వేసి ప్రజల కోరికలను తీరుస్తున్నామని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో న్యూక్రిష్ణానగర్‌లోను, వినాయకనగర్‌లోను లక్షలాది రూపాయలు వెచ్చించి వీధి ప్రజల విజ్ఞప్తి మేరకు ఉపసర్పంచ్ తోట శివసాయి వేగవంతంగా సిమెంట్‌రోడ్లను పూర్తి చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, అదేవిధంగా మండలంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, సాయిలు వేగవంతంగా అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో వారికి వారే సాటి అని అన్నారు. పూర్తిస్థాయిలో అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వేగవంతంగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నారని అన్నారు. మండలంలో అవసరం ఉన్న ప్రతిచోట వేగవంతంగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆదేశించారు. ప్రజలు తమపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పూర్తిస్థాయిలో అభివృద్ధిలో భాగస్వాములు అయి ధ్వజారెడ్డి, తోట శివసాయిలు అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారని అన్నారు. 30 లక్షలతో వేగవంతంగా రోడ్లు వేసి ప్రజా మన్ననలను పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, తోట శివసాయి, సుధాకర్‌రాజు, రమేష్, చిట్వేలి కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, విపిఆర్‌కండ్రిక సొసైటి ఛైర్మన్ సుదర్శన్‌రాజు, సర ్పంచ్‌లు హరిక్రిష్ణారెడ్డి, గోపి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, దార్ల చంద్రశేఖర్, రాజారెడ్డి, రమణారెడ్డి, బిసి మానటరింగ్ సభ్యులు బత్తల సుబ్రమణ్యం, కొప్పల శంకరయ్య, వైఎస్ అన్వర్‌బాషా, కరిముల్లా, కోదూరు మస్తాన్, షఫి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎస్ఇబి ఎఇఎస్ ఎం.రవి

IVలో

## ఆర్డీఓచే క్యాలెండర్ ఆవిష్కరణ

**మదనపల్లె, జనవరి 6 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు అందరూ ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారను. కార్యక్రమంలో ఏపి జిఈఎ డివిజన్ అధ్యక్షులు నాగేంద్రప్రసాద్, అన్నమయ్య జిల్లా కార్యదర్శి జి.గురుప్రసాద్, డిఏఓ శేషయ్య, డివిజన్ కార్యదర్శి శివరామ్‌ప్రసాద్, కోశాధికారి కళ్యాణ్, మల్లికార్జున, శేఖర్, చెంగల్‌రాయుడు, చలపతి, రమణ పాల్గొన్నారు.

## చంద్రబాబు ధర్నాలో జయరామ్‌నాయుడు

**మదనపల్లె, జనవరి 6 ప్రభాతవార్త :**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం కుప్పంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ టిడిపి నాయకులు శ్రీరామనేని జయరామ్‌నాయుడు పాల్గొన్నారు. ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా కుప్పం నియోజకవర్గంలో మూడవరోజు చంద్రబాబునాయుడు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి, పులిపర్తినాని, పలువురు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సేవలు అమోఘం

### రిటైర్డు అడిషనల్ ఎస్పి క్రిష్ణారెడ్డి

**మదనపల్లె, జనవరి 6 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో దివ్యాంగులు, వృద్దులకు చేస్తున్న సేవలు అమోఘమంటూ రిటైర్డు అడిషనల్ ఎస్పి క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన చిత్తూరుజిల్లా ఆర్టీసి రీజనల్ మేనేజర్ జితేంద్రరెడ్డి, పుంగనూరు డిపో మేనేజర్ సుధాకర్, రిటైర్డు డిప్యూటి డైరెక్టర్ అగ్రికల్చర్ రెడ్డప్పరెడ్డిలతో కలసి వెలుగుస్కూల్‌లో వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు స్కూల్ ప్రారంభం నుండి ఇక్కడికి వచ్చి దివ్యాంగులను చూస్తున్నామని, వీరికి వెలుగు సెక్రటరీ ఎం.ఉదయమోహన్‌రెడ్డి చేస్తున్న సేవలు పట్ల అభినందించారు. అనంతరం స్కూల్‌కు బియ్యం, పుస్తకాలు, పెన్నులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, పాల్గొన్నారు.

## రాష్ట్ర డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**మదనపల్లె, జనవరి 6 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్ల అసోసియేషన్ మదనపల్లె డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నుకొన్నారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులుగా ఎస్.పన్నీర్‌సెల్వా ఆధ్వర్యం లో డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కిరణ్ బాబు (ఫైర్‌ఆఫీస్), అధ్యక్షులుగా నాగరాజు(ఐసిడిఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.నాగ రాజు (మున్సిపాలిటి), ఉపాధ్యక్షులు వేణుగోపాల్, ప్రధానకార్యదర్శిగా ఎం.క్రిష్ణప్ప, ట్రెజరర్‌గా టి.మౌళాలి, సహాయకార్యదర్శిగా ఎం.గోవిందు, సభ్యులుగా ప్రసాద్, రెడ్డిశేఖర్, ప్రసాద్‌నాయక్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కాళీగా ఉన్న డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**మదనపల్లె, జనవరి 6 ప్రభాతవార్త:**



ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలి పారు. శుక్రవారం పట్టణంలోని 27వవార్డు దొంతి లేవుట్ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలైన అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు ప్రవేశపెట్టారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు పార్టీలకతీతంగా మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కరీముల్లా, వసీం, ఎస్‌వి.రమణ, రామిశెట్టి శివయ్య, ఆర్‌వి.శివారెడ్డి, శారదారెడ్డి, ఈశ్వర్ నాయక్, నాయకులు మెట్రోబాబ్‌జాన్, రఫి, ఇర్ఫాన్‌ఖాన్ పాల్గొన్నారు.

## వాలంటర్ సేవలు అభినందనీయం

**బి. కొత్తకోట, జనవరి 6 ప్రభాతవార్త:**



బి. కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఐదోవ సచివాలయంలో వాలంటరీగా పనిచేస్తున్న ఆలేటి పల్లికి చెందిన బి రాధ మానవత్వం చాటుకుంది ఇదే గ్రామానికి చెందిన పెన్షన్ దారుడు కాగితి రెడ్డప్ప మూడు రోజుల క్రితం అనారోగ్యం కావడంతో బెంగళూరు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని చింతామణిలో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనకు శుక్రవారం వాలంటర్ బి.రాధ చింతామణికి వెళ్లి అతనికి పెన్షన్ అందించింది దీంతో ఆయన వాలంటర్ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ విషయం తెలుసుకొన్న గ్రామస్తులు,అధికారులు ఆ వాలంటీర్ బి.రాధను అభినందించారు

## 8న పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ ఎన్నికలు

**మదనపల్లె, జనవరి 6 ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వ పెన్షరన్స్ అసోసియేషన్ ఎన్నికలు 8న ఆదివారం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు బిటి.నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని ఎన్‌జిఓ హోమ్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ అసోసియేషన్‌లోని సభ్యులు హాజరు కావాలని కోరారు.

## నలుగురిపై పోక్సో మరో నలుగురిపై దాడి కేసు నమోదు

**మదనపల్లెక్రైం, జనవరి 6 ప్రభాతవార్త:**

దాడికి పాల్పడిన 8మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు రెండవ పట్టణ సిఐ మురళీక్రిష్ణ చెప్పారు. ఇందులో నలుగురిపై పోక్సో, మరో నలుగురిపై దాడి కేసు నమోదు చేశామన్నారు. సిఐ కథనం మేరకు మదనపల్లె పట్టణంలోని జడ్పిహైస్కూల్ ఎదుట ఇటీవల కొందరు యువకులు ఓ యువతి విషయమై ఘర్షన పడిన విషయం విధితమే. అయితే ఓ వర్గానికి చెందిన నలుగురు యువకులు క్రికెట్‌బ్యాట్లు, హాకీకర్రలు, బీరుబాటిళ్ళుతో మరో వర్గానికి చెందిన ఇద్దరి యువకులపై మూకుమ్మడిగా దాడి చేశారు. కాగా నిమ్మనపల్లెకు చెందిన డిగ్రీ విద్యార్థి సంతోష్ ఇటీవల మదనపల్లెకు చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని లవ్ ప్రపోజ్ చేసి అమెను ముట్టకోవడంతో ఘర్షనకు దారితీసింది. దీంతో యువతి అన్న మహమ్మద్‌అలీ తన స్నేహతులు షాహిద్,పురుషోత్తం, సందీప్‌లతో కలసి సంతోష్ అతని స్నేహితులు వినోద్, మల్లికార్జున, ఓబులేసులపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియా, వాట్సప్‌గ్రూపుల్లో హల్‌చల్ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సంతోష్ వర్గంపై పోక్సో, మహమ్మద్ అలీ వర్గంపై దాడి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కళాశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన కేంద్ర బృందం తనిఖీలు

**మదనపల్లెక్రైం, జనవరి 6 ప్రభాతవార్త:**

మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో కేంద్ర వైద్యఆరోగ్యశాఖ బృందం సభ్యులు మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రానికి తనిఖీలు ముగిశాయి. ఇందులో భాగంగా కేంద్రం నుంచి డాక్టర్ అమిత, సింథిల్‌కుమార్, అబ్దుల్‌రెహమాన్, రాష్ట్రం నుంచి జ్యోతి రెడ్డి, జిల్లానుంచి ప్రభావతిరెడ్డిలు బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. కాగా మూడు రోజులు పాటు అన్ని విభాగాలను సైతం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించాలని కేంద్ర బృందం సభ్యులు ఆసుపత్రి అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రి అధికారులు బృందానికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్ ఆంజనేయులు, ఆర్ఎంఓ దివాకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్రైడే డ్రైడే కార్యక్రమం విజయవంతం

**కలికిరి, జనవరి 6 ప్రభాతవార్త:**



మండలంలోని పంచాయితీలలో వైద్య శాఖ, పంచాయితీరాజ్‌శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం విజయవంతమైంది. మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో ఎంఎల్‌హెచ్‌పి సాహీదా, స్థానిక సర్పంచ్ ఏ.రెడ్డి రామ్ ఆధ్వర్యంలో పత్తేగడ పంచాయితీలో ఏఎన్ఎం పార్వతి, సర్పంచ్ రెడ్డమ్మ ఆధ్వర్యంలో, గుట్టపాళ్యం పంచాయతీలో ఏఎన్ఎం రమాదేవి ఆధ్వర్యంలో మునోళ్ళపల్లె పంచాయితీలో స్థానిక ఏఎన్ఎం జయంతి ఆధ్వర్యం లో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయితీ లోని డ్రైనేజి కాలువ లు శుభ్రం చేయించి బ్లీచింగ్ మిశ్రమాన్ని స్ప్రే చేయించారు. ఇటీవల కురిసిన వర్షానికి నిల్వ ఉన్న నీటిని తొలగించే విధంగా చర్యలు తీసు కొన్నారు. అనంతరం అంటు రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సాహీదా, ఆశా కార్యకర్తలు సుమ లత, మంజుల పంచాయితీ అంబాసిడర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**రామసముద్రం, జనవరి 6 ప్రభాతవార్త :**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయ మని మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెన్షన్ వారోత్సవా ల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల్లోప్రకటించారో వాటిని అర్హులకు అంది అమలయ్యేలా చేశారన్నారు. అవ్వాతాతల పెన్షన్లు అధి కారంలోకి రాగానే అంచలంచెలుగా పెంచుకొంటూ పోతూ రూ.2750లకు పెంచారన్నారు. మళ్ళీ రూ.250లు పెంచి మూడువేల వరకు ఇస్తున్నామన్నారు. కార్య క్రమంలో ఎంపిపి కుసుమకుమారి, జడ్పిటిసి రామచంద్రా రెడ్డి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, సింగిల్‌విండో కేశవరెడ్డి, భాస్కర్‌గౌడ్, రాధారెడ్డి, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, శివ, తిమ్మయ్య, ఎంపి టిసిలు, మండల అధికారులు, ప్రజాప్రతి నిధులు, సర్పంచ్ గెవెన్న, జికె.చంద్ర, రెడ్డప్పనాయుడు, తిప్ప రాజు, ఉదయ్ శంకర్‌రెడ్డి, ఆనంద పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**రామసముద్రం, జనవరి 6 ప్రభాతవార్త :**



స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నాడు నేడు పనులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు వైద్యశాలలో రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో మెరుగైన ఐద్యం అందించి ప్రజలు ప్రైవేటు వైద్యశాలకు వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. నాడు నేడుపనులతో మరింత మెరుగైన సేవలు అందించే వీలు ఉంటుందన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ లీలాను రోగులు పరిస్తితిపై అడిగి తెలుసు కొన్నారు. అనంతరం వైద్యశాల రికార్డులను పరిశీలించారు. వైద్యుల బృందం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి కుసుమకుమారి, జడ్పిటిసి రామచంద్రారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, వైసిపి రమణా రెడ్డి, గంగాధర్‌నాయుడు మండల కన్వీనర్ భాస్కర్‌గౌడు, రాధారెడ్డి వైద్యాధి కారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సామాజిక సేవలు అందించాలి

**కురబలకోట, జనవరి 6 ప్రభాతవార్త :**



విద్యార్థులు సామాజిక సేవల్లో భాగస్వామ్యులు కావాలని మిట్స్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేష్ అన్నారు. శుక్రవారం మిట్స్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గొల్లపల్లె గ్రామంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం,కరోనా నివారణపై, ప్రాథమిక విద్యపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యను మధ్యలో ఆపరాదని ఇష్ట పడి చదవాలన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వారం రోజులు పాటు గొల్లపల్లె గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.

## ఏకాగ్రతతో వాహనాలను నడపాలి : డిఎస్‌పి

**కురబలకోట, జనవరి 6 ప్రభాతవార్త:**



ఏకాగ్రతతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరగవని మదనపల్లె డిఎస్‌పి కేశప్ప అన్నారు. శుక్రవారం మిట్స్‌కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు అతిగా, జాగ్రత్తగా, వేగంగా వాహనాలను నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. దీంతో జీవితంలో మాయని మచ్చగా తీర్చలేని లోటుగా ఉంటుందన్నారు. చిన్నపొర్లపాట్లతో పెద్దతప్పులు జరుగుతాయన్నారు. అలసిపోయినపుడు డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, మదనపల్లె రూరల్ సిఐ శివాంజనేయులు, ముదివేడు ఎస్ఐ సుకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్దుడిపై హత్యాయత్నం

**మదనపల్లెక్రైం, జనవరి 6 ప్రభాతవార్త:**

ఆర్థిక వివాద గొడవల్లో భాగంగా ఓ యువకుడు కత్తితో వృద్దునిపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఈ ఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఏస్టేట్‌కు చంఎదిన వారాది(62) తమలపాకుల వ్యాపారం చేసి జీవిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో వాల్మీకిపురం మండలం సాకిరేవుపల్లెకు చెందిన రెడ్డిశేఖర్‌కు రూ.90 వేల వడ్డీకి ఏడాది క్రితం ఇచ్చాడు. అతన వెళ్ళి కలికిరి మండలం పాలెంకురవ పల్లెలోని తన మరదలైన పార్వతికి వడ్డీకి ఇచ్చాడు. ఆమె వడ్డీ చెల్లించకపోవడంతో పార్వతిని వేధించడం మొదలుపెట్టాడు. వీరి మధ్యమనస్థార్థం అధికమైంది. వారాది గురువారం సాకిరేవుపల్లెకు వెళ్లి రెడ్డిశేఖర్‌ను నిలదీశాడు. వీరి మధ్య ఏం జరిగిందో తెలియదు పార్వతి కుమారుడు భానుప్రకాస్ శుక్రవారం మదనపల్లెకు చేరుకొని వారదితో గొడవ పడ్డారు. దీంత ఆవేశంకు గురై కత్తితో వృద్దునిపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకొన్న పోలీసులు కేసు నమోదుచేసి భానుప్రకాష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. దీనిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మురళీక్రిష్ణ తెలిపారు.

## ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిన వైకాపా ప్రభుత్వం

**బి. కొత్తకోట, జనవరి 6 ప్రభాతవార్త:**



నిత్యావసర ధరలు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా వైకాపా ప్రభుత్వం ప్రజల పై మోయలేని భారం మోపిందని తంబల్లపల్లి నియోజకవర్గ అసెంబ్లీ పోల్ కోఆర్డి నేటర్ కుడుం శ్రీనివాసులు ,టిడిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి రెడ్డి, టిడిపి రాజంపేట అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ గురువారెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి ఆరోపించారు.శుక్రవారం బి.కొత్తకోట మండలంలోని నాయణభావి పంచాయతీ, పట్రవారిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలు భారీగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలను , ఆర్టీసీ, విద్యుత్ చార్జీలను వెంటనే తగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలవడం చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. ప్రభుత్వ వెతిరేకవిధానాలపై విచారించారు. ఈ కార్యక్రమంలోటిడిపి ప్రధానకార్యదర్శి దేవరింటి కుమార్, సుకుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మస్తాన్, షమిఉల్లా, మోటుకు శివ, భాస్కర్ రెడ్డి, రెడ్డెన్న, తాతప్ప, టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

**లక్కిరెడ్డిపల్లె, జనవరి 6, ప్రభాతవార్త:**



క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం వడ్డెపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి పండగకు ముందు నిర్వహించే ఈ క్రికెట్ టోర్నీకి విశేష ఆధరణ లభిస్తుండడం అభినందనీయమన్నారు. యువతను ప్రోత్సహించే ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు మండల స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయిలో అభి వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తొలి మ్యాచ్‌ను కుర్నూతల అగ్రహారం మరియు రాచపల్లి జట్ల మధ్య టాస్ వేసి ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోట ములు సహ జమన్నారు. క్రీడల పట్ల యువకులు కూడా ఆసక్తిని కనబరచా లన్నారు. క్రీడల ద్వారా శారీరక మానసిక ఉల్లాసం పొందగలరని తెలిపారు. ఈ క్రికెట్ టోర్న మెంట్‌లో పాల్గొనడానికి ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి. మొదటి బహుమతి రూ.30 వేలు, 2వ బహుమతి రూ.20వేలు అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణ, వెంకటరామరాజు, ఆంజనేయులు, రమణ, గంగాధర్, వేమయ్య, వేణు, టీడీపీ యూత్ అధ్యక్షులు ధర్మారెడ్డి, శివ కుమార్ యాదవ్, రవి, హరి, ఎను పాల్గొన్నారు.

## శ్రీప్రజ్ఞ శిల్ప విగ్రహశాలను సందర్శించిన చైర్‌పర్సన్

**జమ్మలమడుగు, జనవరి 6, ప్రభాతవార్త:**



ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో గుంటూరు జిల్లా పర్యటనలో భాగంగా తెనాలి పట్టణంలో శ్రీ ప్రజ్ఞ శిల్ప విగ్రహ శాలను శుక్రవారం ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) ఛైర్‌పర్సన్ శ్రీమతి బడిగించల విజయలక్ష్మీ పాల్గొన్నారు. అక్కడి కళాకారులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకురావడంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎగ్జిబిషన్‌లో కళాకారులు తయారు చేసిన వస్తువులను కొనుగోలుకు ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం అనుమతితో త్వరలో అన్ని జిల్లా ప్రధాన కేంద్రాలలో వైఎస్ఆర్ హ్యాండీక్రాఫ్ట్ బజార్‌ను ఏర్పాటు చేసి హస్తకళాకారులను ప్రోత్సహిస్తామన్నారు. వైఎస్ఆర్ మహిళా హ్యాండీక్రాఫ్ట్ ఎస్‌హెచ్‌జీగ్రూప్స్ ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు అందించే ప్రక్రియకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో గుంటూరు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ ఎంవీ కుమార్, సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

## ముదివేడు గ్రామ సచివాలయ కన్వీనర్‌గా సమీవుల్లా

**కురబలకోట, జనవరి 6 ప్రభాతవార్త :**



మండలంలోని ముదివేడు గ్రామ సచివాలయ కన్వీనర్‌గా సమీవుల్లాను నియమించారు. ఈ సందర్భంగా సమీ వుల్లా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ముదివేడు రాయల్‌బ్రదర్స్ అంజాద్‌ఖాన్, ఫిరోజ్ ఖాన్, ఎంపిపి దస్తగిరిసాబ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్ర శేఖర్‌రెడ్డికి రుణపడి ఉండానని సమీవుల్లా తెలిపారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాధ్యతలు చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించండి

**జమ్మలమడుగు, జనవరి 6, ప్రభాతవార్త:**



మలేరియా డెంగ్యూ జ్వరాలు మంచి నీటి లో పెరిగే దోమల వల్ల మాత్రమే ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతాయని అందుకని ప్రతి ఒక్కరూ ఎవరికి వారు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని జమ్మల మడుగు ఎమ్మెల్యే మూలే సుధీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నాగలకట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం వాటి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ప్రతి శుక్రవారం ఎవరికి వారు తమ ఇంటి లోపల బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనిఅన్నారు. కార్యక్రమంలో నాగలకట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యఅధికారి డా.జి.నవీన్, మలేరియా యూని ట్ అధికారి స్బురాజు, పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది, మహ్మద్, చంద్రశేఖర్, కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్దులకు అన్నదానం

**జమ్మలమడుగు, జనవరి 6, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు శ్రీవారి సేవా సమితి సభ్యులు వృద్దులకు, బీదలకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు శ్రీవారి సేవా సమితి అధ్యక్షులు సుధాకర్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పౌర్ణమి సందర్బంగా జమ్మలమడుగు శ్రీ వారి సేవా సమితి తరుపున పట్టణంలోని పేదలకు, అనాథలకు వృద్దులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. జిల్లాలో కూడా అన్నం లేక ఎంతో మంది అనాథలు పస్తులతో జీవనం సాగిస్తున్నారని వారికి అన్నదానం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవా సమితి ట్రెజరర్ గుర్రం శ్రీను, సమితి సభ్యులు రాధాకృష్ణ, విక్రం, ప్రసాద్ పాల్గొన్నారు.

## పట్టణంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**జమ్మలమడుగు, జనవరి 6, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో రోజూ ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామని ఎక్కడ అపరిశుభ్రత నిలువరాదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మున్సి పల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో 20 వవార్డుల్లో అనునిత్యం డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేస్తూ రోడ్లపై ఎక్కడా చెత్తా చెదారాలు లేకుండా శుభ్రం చేస్తున్నామన్నారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లి శుభ్రపరచడం జరిగిందన్నారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర పదార్థాలు వేయకుండా ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

**ప్రొద్దుటూరు జనవరి 6, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరులోని శ్రీనివాస్ నగర్ వీధిలో నివసిస్తున్న పెద్ద చీపాడు వీరభద్రుడు(76) అనే వ్యక్తి చనిపోయిన విషయం శ్రీనివాస్‌నగర్‌లోని ప్రజలు ద్వారా తెలుసుకుని వారికి బంధువులు ఎవరు లేకపోవడంతో మేఐహెల్ప్యు ఫౌండేషన్ చైర్మన్ మోరే.లక్ష్మణ్‌రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి ప్రొద్దుటూరు లోని హిందూ స్వశన వాటికలో సంప్రదాయ ప్రకారం అంతక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ కామనూరు శివసాయినాథ్, శుభన్, సుబ్బయ్య, విజయ్‌కుమార్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉరుసు ఉత్సవాల్లో సుభాన్‌బాషా ప్రార్థనలు

**కడప ఏడురోడ్లు, జనవరి 6, ప్రభాతవార్త:**



నగరానికి చెందిన వికాస్ గ్రూప్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్, వైసీపీ నాయకులు సుభాన్ బాషా తమిళనాడులో వెలసిన చారిత్రాత్మక మైన నాగూర్‌లో ఉన్న హజరత్ ఖాదర్ వలీ సాహెబ్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో, శాంతియుతంగా జీవించాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించామని తెలిపారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం



**వేంపల్లె, జనవరి 6, ప్రభాతవార్త :**

వేంపల్లె మండలంలోని కత్తులూరు గ్రామ పంచాయతీ తాటిమాకులపల్లె ఎస్సీ కాలనీలో చైతన్య మహిళా మండలి, క్రిష్టియన్ లైన్ సంస్థ ద్వారా ఉచితంగా ఒక మంచినీటి బోరును వేసి బోరింగ్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. శుక్రవారం ఈ బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పావని, వార్డు మెంబరు ప్రతాప్, శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచి ఆర్‌ఎల్‌వి ప్రసాద్‌రెడ్డి, దళితవాడ సీఎంఎం అధ్యక్షురాలు రామాంజనమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించాలి

**కడప ఎడ్యుకేషన్, జనవరి 6, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యా యులకు రాష్ట్ర ప్రతి నెల మొదటి తేదీ జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉండడం సిగ్గుచేటని ఉపాధ్యాయ సంఘ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున మాట్లాడుతూ ఉద్యోగులంటే ప్రభుత్వంలో భాగం, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు సేవ చేసేది ఉద్యోగులే వారికి ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించడం, సకాలంలో బిల్లులు చెల్లించడం, వారికి రావాల్సిన డీఏలు ఇవ్వడం, ప్రభుత్వం మొదటి బాధ్యత. ఇప్పటికీ పీఎఫ్ రుణా లు, సరెండర్ లీవు, బిల్లులు, ఏపీజీఎల్ఐ రుణాలు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు అన్నీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీఆర్‌సీతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయా రన్నారు. ఇంత వరకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాలు అన్నింటినీ వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగులందరూ ఆర్థిక సంక్షోభంలోనూ తీవ్ర నిరాశ నిస్పృహలలోనూ ఉన్నారని ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సాఫ్ట్ టెన్నిస్‌లో భాష్యం విద్యార్థిని ప్రతిభ

**కడప ఎడ్యుకేషన్, జనవరి 6, ప్రభాతవార్త:**



కడప నగరం ఐటీఐ సర్కిల్‌లో ఉన్న భాష్యం స్కూలులో చదువుతున్న మోక్ష నేషనల్ స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికై ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో గుజరాత్ రాష్ట్ర అహ్మదాబాద్‌లో జరిగిన పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాకు వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా మోక్షని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మోక్ష చిన్నతనం నుంచి క్రీడల్లో చురుగ్గా పాల్గొనేదని, టెన్నీస్ పట్ల అమితమైన ఆసక్తిని కనబరిచేదని, తన ప్రతిభను వృథా చేయడం, ప్రోత్సాహం ఇస్తూ ప్రతి టోర్నమెంట్‌లో పాల్గొనేటట్లు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ వద్ద విద్యనభ్యసించే ప్రతి విద్యార్థిని చదువులోనే కాకుండా కాంపిటేటీవ్ పరీక్షలు, క్రీడల్లో విద్యార్థులకు తగిన తర్ఫీదును ఇచ్చి అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండేలా చూస్తున్నామన్నారు. మోక్ష సాధించిన ఈ ఘనతను తాము ఎంతగానో గర్విస్తున్నామని తెలిపారు.

## సంక్షేమ ప్రభుత్వాన్ని దీవించండి

**పులివెందుల, జనవరి 6, ప్రభాతవార్త :**



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని దీవించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. సింహాద్రిపురం మండలంలోని పైడిపాలెంలో శుక్రవారం గడపగడకు వైకాపా కార్యక్రమం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పాలన గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## 8న యాదవుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రొద్దుటూరు జనవరి 6, ప్రభాతవార్త**



పట్టణంలోని పారడైజ్ కళ్యాణ మండపంలో ఈ నెల 8 ఆదివారం అఖిల భారత యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు కృష్ణాలయం, జాతీయ ప్రధాన కార్యదర్శి చల్లా రాజగోపాల్ పేర్కొన్నారు. నాడు అఖండ భారత రాజ్యాన్ని నిర్మించి పాలించి కీర్తిని ఖ్యాతిని ఘనతను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన యాదవ వంశ శ్రీకృష్ణుని వారసులమైన యాదవ సమాజం రాష్ట్రంలో సుమారు 75 లక్షల మంది జనాభాగా ఉందన్నారు. ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా విద్య ఉద్యోగ ఉపాధి వర్తక వాణిజ్య పారిశ్రామిక రంగాలలో ఎంతో వెనుకబడి ఉన్న సంగతి తెలిసిందే అన్నారు యాదవులకు సరియైన న్యాయం జరగాలని యాదవుల హక్కుల కోసం పోరాటానికి సిద్ధపడాలని యాదవ పెద్దలందరూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు అందులో భాగంగా బలి ఐక్యత పోరాట శక్తిగా యాదవ జాతిని మలిచేందుకు ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు జాతీయ రాష్ట్ర జిల్లా యాదవ నాయకులు ప్రముఖులు, ఉద్యోగులు, విద్యార్థి యువజనులు మహిళ లు కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఊడవగండ్లలో వ్యక్తి దారుణహత్య

**పులివెందుల, జనవరి 6, ప్రభాతవార్త :**



తొండూరు మండలంలోని ఊడవగండ్లలో సహదేవరెడ్డి అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సహదేవరెడ్డిపై అదే గ్రామానికి చెందిన ప్రహ్లాదరెడ్డి కొడవలితో దాడి చేసి హత్యచేశాడు. స్థానికులు సహదేవరెడ్డిని హుటాహుటిన పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు

**వేంపల్లె, జనవరి 6, ప్రభాతవార్త :**



వైకాపా పాలనలో రాష్ట్రంలోని సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారారని ఏపీ కాంగ్రెస్ కమిటి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిందన్నారు. దీని ప్రకారం రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎంతో, గ్రామ పంచాయతీలకు సర్పంచి అంతే అన్నారు. కానీ దురదృష్టవశాత్తు వైకాపా పాలనలో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా, రాజకీయాలకు ఆరవ వేలుగా తయారయ్యారన్నారు. నిధులు, విధులు, అధికారాలు లేక గ్రామ పంచాయతీలుగా నిర్వీర్యం అయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గోరుచుట్టుపై రోకటిపోటులాగ వాలంటీరు, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా గ్రామ పంచాయతీలు మరింత నిర్వీర్యం అయ్యాయని ఆయన తెలిపారు. వాలంటీరు, గ్రామ సచివాలయ వ్యవస్థను గ్రామ పంచాయతీ ఆధీనంలోకి తీసుకురావాలని, సర్పంచుల ఉద్యమబాటకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తులసిరెడ్డి వెల్లడించారు.

## ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం సద్వినియోగం చేసుకోండి

**టి.సుండుపల్లి.జనవరి 06 ప్రభాతవార్త**



ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏపిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఐస్ బాక్స్‌తో కూడిన మోటర్ సైకిల్‌కు 75వేల రూపాయలు, ఐస్ బాక్స్‌తో కూడిన 3చక్రాల వాహనంకు 3లక్షల రూపాయలు చేపల అమ్మకం కేంద్రం మినీ కియోస్క్ నిర్మాణంకు 1లక్ష 75వేలు రూపాయలు ఒక యూనిట్‌కు ధర ఉంటాయని ఇందులో సబ్సీడి ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60శాతం, బీసి ఇతరులకు 40 శాతం ఉంటాయని ఈ పథకం వెలుగు మత్స్య శాఖ సమన్వయంతో వెలుగు ద్వారా రుణం సబ్సీడి మత్స్య శాఖ ద్వారా సబ్సీడి ఉటుందని, ఈ పథకం మండలంలోని ఎస్‌హెచ్‌జి మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జగన్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా టీడిపి ప్రభంజనాన్ని ఆపలేరు

**-మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

**రాయచోటి.జనవరి 06 ప్రభాతవార్త**



వైసిపి అరాచకపాలనతో విసిగిపోయినా ప్రస్తుత పాలన ఎప్పుడు ముగుస్తుందా? రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా భావించే చంద్రబాబు పాలన ఎప్పుడు వస్తుందా అని ఆలోచనలో ఆంధ్రరాష్ట్ర ప్రజలు ఉన్నారని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వైసిపి పార్టీ పాలనపై ధ్వజమెత్తారు. శుక్రవారం రాయచోటిలోని మండిపల్లి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాయచోటి నియోజవకర్గ తెలుగుదేశం నాయకులు మండిపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రజలలో వస్తున్న ఆదరణను జగన్ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు సభలకు ఇసుక వేస్తే రాలని జనం వస్తున్నా జన సంద్రమే దీనికి ఉదాహరణ అని ప్రజాదరణ తట్టుకోలేని జగన్ రాత్రికి రాత్రే తెలుగుదేశం పార్టీ ప్రభంజనాన్ని ఎలాగైనా ఆపాలని కుట్రలుపన్ని ఎప్పుడో పురాతన బ్రిటీష్ కాలం నాటి జీవోలను అమలు చేయడం దుర్మార్గమయిన చర్య అని దుయ్యబట్టారు. ఈ జీవోపై రాష్ట్రంలో ప్రతిపక్షాలు, వామపక్షాలు మరియు ప్రజాస్వామ్యవాదులందరూ ముక్త కంఠంతో ఖండిస్తున్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా కుప్పం ప్రజలు చంద్రబాబుకు బ్రహ్మరథం పడుతున్న విధానం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో జగన్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని సూచించారు.

## అందరకి అనుకూలంగా ఉండేందుకు జీవో నంబర్ ఒకటి

**-మార్కెట్ కమిటి చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి**

**రామాపురం.జనవరి 06 ప్రభాతవార్త**



పార్టీలకు అతీతంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా అమలు చేసిన జీవో నంబర్ ఒకటి అని ఈ జీవోను రద్దు చేసి తన సొంత ప్రయోజనాలకు అనుకూలంటా ప్రజలను మలుచుకునే విధంగా టిడిపి పార్టీ అభ్యర్థులు మాట్లాడడం తగదని లక్కిరెడ్డిపల్లి మార్కెట్‌కమిటి చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ ఒకటి వ్యక్తిగతంగా ఒక పార్టీకి సంబందించినది కాదని అన్ని పార్టీలకు అనుకూలంగా ప్రజలందరికి ఉపయోగపడేలా ఉందని తెలుగుదేశం పార్టీ తన వ్యక్తిగత ఉనికిని చాటుకునేందుకు పార్టీ కార్యకర్తలు వీధి రాజకీయాలు చిల్లర చేష్టలు చేస్తున్నారని వీటిపై రాద్దాంతం చేయడం ఎంత మాత్రం సబబు కాదన్నారు. సంక్షేమ పథకాలు గడపగడపకు అందాలన్నదే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని దానికి అనుకూలంగా రాష్ట్ర ప్రజలు 152 స్థానాలను అందించారని మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం పూర్తి చేసి దేశంలోనే ఆదర్శం సిఎంగా పైకి ఎదుగుతున్నాడని ఆయన తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా తాగునీటి సాగునీటికి కావలసిన నిధులను సమకూర్చిన ఏకైక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అని ఆయన అన్నారు. ప్రజలకు మేలు చేసే నాయకుడు వెంట ఎప్పుడు వెన్నంటి కార్యకర్తలం ఉండి అభివృద్ధి బాటలో అడుగులు కలుపుతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మాజీ జెడ్‌పిటిసి అబ్బాపతి, రెడ్డెయ్య, వైసిపి రాష్ట్ర యూనియన్ విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, ఆంజనేయులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో విజిలెన్స్ అధికారుల దాడులు

**సంబేపల్లి.జనవరి 06 ప్రభాతవార్త**

సంబేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ తన సిబ్బందితో కలిసి రికార్డులను పరిశీలించామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ఉమామహేశ్వర ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రోగుల రోజువారి అందిస్తున్న వైద్య సేవలు గురించి డాక్టర్ సూర్యనారాయణ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రక్త నమూనాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు కోసం చేపట్టవలసిన అంశాల గురించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. దాడులలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అగ్రిమెంట్స్ అధికారి శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ రావు, కానిస్టేబుల్ హరినాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పబ్లిసిటీ షో కోసం జనం ప్రాణాలు బలి

**– వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్**

**కడప కార్పొరేషన్, జనవరి 6, ప్రభాతవార్త:**



ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పబ్లిసిటీ షో కోసం జనం ప్రాణాలు బలి అయిపోతున్నారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కందుకూరులో ఇరుకు రోడ్డులో బహిరంగ సభ నిర్వహించి 8 మంది ప్రాణాలు బలికొన్న ఆయన గఉుంటూరులో పదివేల మందికి చీరెలు ఇస్తామని టోకెన్లు ఇచ్చి 30 వేల మందిని రప్పించి మరో ముగ్గురిని బలి తీసుకున్నారన్నారు. ఆయన పబ్లిసిటీ పచ్చితో జనాల ప్రాణాలు బలితీసుకోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి చీప్ ట్రిక్స్‌ను ప్రజలు నమ్మబోరన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ 175కు 175 సీట్లు సాధించడం ఖాయమని, తెదేపా తుడిచిపెట్టుకుపోవడం తథ్యమని జోష్యం చెప్పారు.

## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఎస్ఇబి ఎఇఎస్ ఎం.రవి**

**రాజంపేట అర్బన్, జనవరి 6 ప్రభాతవార్త**



విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిబారిన పడితే విలువైన జీవితం నాశమనవుతుందని అన్నమయ్య జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ ఎం.రవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అన్నమాచార్య పిజి కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అవగాహన సదస్సు ఎస్ఇబి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి మత్తుపదార్థాలకు అలవాటు పడితే బానిసలవుతారన్నారు. మాదకద్రవ్యాల బారిన పడితే జరిగే అనర్థాలను షార్ట్‌ఫిల్మ్ ద్వారా విద్యార్థులకు సమర్పించారు. అందుకే విద్యార్థులు సన్మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఇబి అధికారులు విద్యార్థులచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించేందుకు తమవంతు బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సిఐ శ్రీహరిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ డిజె సమతానాయుడు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటీష్ జీవోలకు భయపడేది లేదు

**-ప్రతిపక్షాన్ని అణచివేసే ధోరణి**

**-పోరాటాలకు సిద్దమవుదాం – ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పిలుపు**

**రాయచోటి.జనవరి 06 ప్రభాతవార్త**



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బ్రిటీష్ జీవోలకు భయపడే ప్రసక్తి లేదని రాయచోటి నియోజవకర్గ టీడీపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం కొత్తపల్లిలో శుక్రవారం పార్టీ శ్రేణులతో రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీని అనిచివేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక నియంతలా బ్రిటీష్ పాలకులు గుర్తొచ్చే విధంగా పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి జీవోలకు తెలుగుదేశం పార్టీ ఏనాడు భయపడదని తెలిపారు. ఎలాంటి సభలు, సమావేశాలు చేయాలన్నా పోలీస్‌ల పర్మిషన్ తీసుకోవాలని చీకటి జీవోలను విడుదల చేయడం దారుణమన్నారు. ప్రజలు తెలుగుదేశం పార్టీకి పడుతున్న బ్రహ్మరథాన్ని చూసి ఓర్వలేక ఈ జీవోను తీసుకొచ్చారని అన్నారు. జీవో నంబర్ 1 అమల్లో ఉంటే నందిగామలో జాతీయ రహదారిపై అధికార పార్టీ నేతలు వీరంగం చేస్తూ బాణాసంచా పేలుస్తూ భారీ ర్యాలీ నిర్వహించారని రమేష్‌రెడ్డి ఆరోపించారు. పోలీస్‌లు అక్కడ జీవో అమలు చేయకుండా పైగా ప్రోత్సహించారన్నారు.

## సంక్షేమ రథసారధి ముఖ్యమంత్రి జగన్

**– మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ నాగం సుబ్బారెడ్డి**

**బద్వేలు అర్బన్, జనవరి 06 ప్రభాతవార్త :**



ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తూ ప్రజలందరి మన్ననలు పొందారని మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ నాగం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్ళలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మెన్ కల్లూరు రమణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి వారికి నూతన సంవత్సర శుభాకంక్షలు తెలియజేశారు. అనంతరం మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ నాగం సుబ్బారెడ్డి మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీలో కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. బద్వేలు నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. 2023వ సంవత్సరంలో రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలందరు కూడా సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రూపారాంపేట శివాలయం ప్రెసిడెంట్ మడకల రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, మద్దిక సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ అసోషియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఐ

**బద్వేలు అర్బన్, జనవరి 06 ప్రభాతవార్త :**



ఫ్రెండ్స్ అసోషియేషన్ 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం అర్బన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోషియేషన్ సభ్యులు వెంకట సుబ్బయ్య, సాగర్, రమణతో పాటు పలువురు పాల్గొన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

## ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోండి

**డిఎం రమణయ్య**

**రైల్వేకోడూరు రూరల్, జనవరి 6 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు బస్టాండు సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాంగణాన్ని వ్యాపారులకు లీజు పద్ధతిన అందజేయనున్నట్లు రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక బస్టాండు నందు ఆయన స్థల పరిశీలన నిర్వహించి బ్రిడ్జి సమీపంలో ఉన్న ప్రాంగణాన్ని చేపల మార్కెట్‌కు కేటాయించడం జరిగిందని, అదేవిధంగా నర్సరీలకు, పలురకాల వ్యాపార సముదాయానికి ఆర్‌టిసి ప్రాంగణంలో అద్దెకు ఇవ్వనున్నామని, ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.రమణయ్య, కోడూరు కంట్రోలర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామాలయగోపుర నిర్మాణానికి 50వేల రూపాయలు విరాళం

**గాలివీడు.జనవరి 06 ప్రభాతవార్త**



రామాలయం గోపురం నిర్మాణానికి 50116 రూపాయలు విరాళం ఎన్ఆర్ఐ చెంచు వేణుగోపాల్‌రెడ్డి అందించారు. మండలంల కేంద్రం గేటు వద్ద గల శ్రీ కోదండ రామాలయం మూడంతస్తుల రాజగోపురం నిర్మాణానికి తన వంతు సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. గతంలో కూడా ఆయన బ్రాహ్మణవీధి శ్రీవారి ఆలయంలో నీటి వసతి నిమిత్తం లక్ష రూపాయలును వెచ్చించి బోరును వేయించారు. అది ఇలా ఉండగా రామాలయం రాజగోపురానికి ఇది వరకే దేవాదాయ శాఖ ద్వారా 42లక్షల రూపాయలు మంజూరు కావడం విశేషం. కార్యక్రమంలో కమిటి సభ్యులు బ్రహ్మానందరెడ్డి, వీరారెడ్డి, సిద్దారెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తులసి నాగరాజ సేవలు అభినందనీయం

**– ప్రముఖ వ్యాపారవేత్త యాదాళ్ళ కృష్ణమూర్తి**

**బద్వేలు అర్బన్, జనవరి 06 ప్రభాతవార్త :**



బద్వేలు పట్టణంలో ప్రముఖ మండి వ్యాపారి తులసి నాగరాజ దాన, ధర్మాలకు ప్రతీకగా ఆపదలో ఉన్నవారికి చేయూతనిచ్చే లక్ష్యంతో దేవాలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న తులసి నాగరాజ సేవలు అభినందనీయం అని ప్రముఖ వ్యాపారవేత్త యాదాళ్ళ కృష్ణమూర్తి, కొలిశెట్టి సత్యనారాయణ, శ్రీకాకుళం వెంకటసుబ్బయ్య, శ్రీరాం నాగేశ్వరరావు, సోములేటి సంజీవ్ అన్నారు. తులసి నాగరాజ జన్మ దినోత్సవం పురస్కరించుకొని పలువురు ఆర్యవైశ్యులు, అభిమానులు భారీ స్థాయిలో నాగరాజాకు శాలువా కప్పి వారి సేవలను అభినందిస్తూ వారిని సత్కరించారు. అనంతరం యాదాళ్ళ కృష్ణమూర్తి, కొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తులసి నాగరాజ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నైజం కలిగిన వ్యక్తి అని, స్నేహశీలి, నిగర్వి, ఆర్యవైశ్యుల ఆత్మీయ అభిమాని అని, దాన, ధర్మాలకు ప్రతీకగా నిలిచిన వ్యక్తి అన్నారు. బద్వేలు ప్రాంతంలో అనేక దేవస్థానాలకు వారి వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఆపదలో ఉన్న వారికి చేయూతనిచ్చే లక్ష్యంతో ముందుకు పోతున్న తులసి నాగరాజ ఆయురారోగ్యాలతో ఉండాలని, రాబోవు రోజులలో పేద ప్రజలకు చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేయాలని పలువురు వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుంకు సుబ్బారావు, సూరే వెంకట సుబ్బయ్య, యల్లనూరు సత్యనారాయణ, ఓబులశెట్టి సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు వైకాపా పరిశీలకునిగా పోలా శ్రీనివాసులరెడ్డి

**ఎమ్మెల్యే రాచమల్లుతో భేటీ**

**రాజంపేట అర్బన్, జనవరి 6 ప్రభాతవార్త**



రాజంపేట మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిని ప్రొద్దుటూరు అసెంబ్లి పార్టీ పరిశీలకునిగా అధిష్టానం నియమించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని కలిసి పార్టీ పరిస్థితులను చర్చించి పటిష్టత కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా పోలా శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట మైదుకూరు పార్టీ పరిశీలకులుగా నియమించిన అన్నమాచార్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను కలిశారు.

## కొత్త పింఛన్లతో వృద్ధుల్లో ఆనందం

**నందలూరు, జనవరి 6 ప్రభాతవార్త**

స్థానిక మండల ఎంపిడిఒ కార్యాలయం నందు నందలూరు గ్రామ పంచాయతిలో సచివాలయం-1లో 15, సచివాలయం-2లో 6 మొత్తం 21 కొత్త పింఛన్లు మంజూరైన నేపథ్యంలో శుక్రవారం వారికి నందలూరు గ్రామ సర్పంచ్ మోడపోతల సుభాషిని, మండల ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇందులో పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికి అందజేయాలనే ఉద్దేశ్యంతోనే వాలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ఎక్కడా అసత్య ప్రచారాలకు తావివ్వకుండా అర్హులైనవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, నందలూరు ఎంపిటిసి సుభాన్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్‌లు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని పెద్ద దర్గాలో పూజలు

**కడప వైద్యవిభాగం, జనవరి 6, ప్రభాతవార్త:**



కడప నరంలోని పెద్ద దర్గాలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ఈనెల 27వ తేదీ కుప్పం నుంచి చేయనున్న పాదయాత్ర విజయవంతం కావాలని తెదేపా నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో పెద్ద దర్గాలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్‌బాబు, నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానపురెడ్డి శివకొం డారెడ్డి, తెలుగు రైతు నాయకుడు జి.లక్ష్మీరెడ్డి పెద్ద దర్గాలో పూజలు చేసి అనం తరం వారు మాట్లాడారు. మాజీ మంత్రి తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, తెలుగు దేశం పార్టీ మ హిళా విభాగం అధ్యక్షురాలు మురికినాటి సునీత, వార్డు ఇన్‌ఛార్జిలు గాజులపల్లె రాఘవేంద్ర, షేక్ గౌస్‌పీర్, మురికి నాటి రామాంజనేయులు, మరియు తెదేపా నాయకులు శంకర్‌రెడ్డి, కరీముల్లా వెంకటేష్ పాల్గొన్నారు.

## పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ రావడం మండల ప్రజల అదృష్టం

**వైసిపి నాయకులు విజయభాస్కర్‌రెడ్డి**

**వీరబల్లి.జనవరి 06 ప్రభాతవార్త**



వీరబల్లి మండలంలో వంగిమళ్ల పంచాయతీ పాలకొండల సమీపంలో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్ట్ మంజూరు కావడం నిర్మాణ పనులు చేపట్టడం మండలానికి ఒక వరంలాంటిదని వైసిపి నాయకులు మాజీ ఎంపిపి గాలివీటి విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజా అభిప్రాయ సేకరణ సమావేశంలో వంగిమళ్ల దిగువ రాచపల్లి సమీపంలో ఏర్పాటు చయడం జరిగింది. ఈ సమావేశంలో మండల నాయకులు, రైతులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల యజమానులు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ 8వేల కోట్ల రూపాయలతో నిర్మించడం మంచిదన్నారు. దీంతో మండల అభివృద్ది మరియు రాష్ట్రంలో మండలానికి గుర్తింపు రావడం జరుగుతుందన్నారు. అంతేకాక నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. అదే విధంగా వంగిమళ్ల దిగువ రాచపల్లి పంచాయతీల ప్రలకు, రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలేని నాయకులను కోరారు. వారి భూములకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఉద్యోగ విషయాలలో వారికి మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ముఖ్యంగా రైతులకు, ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా డిఆర్‌వో సత్యనారాయణ, పర్యావరణ శాఖ రీజనల్ ఆఫీసర్ జావీద్‌బాష, స్థానిక తహశీల్దార్ తులశమ్మ, ప్రాజెక్ట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రజా అభిప్రాయ సేకరణా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వైసిపి నాయకులు మదన్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాదరెడ్డి, వీరనాగిరెడ్డి, స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

## వద్దాశ్రమంలో అన్నదానం



ఫోటోరైటప్ః వద్దా శ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

**పీలేరు, జనవరి 6 ప్రభాతవార :**

పీలేరు పట్టణంల కావలిపల్లెకు చెందిన ఎన్నారై ఆకుల సుధారాణి, నాగార్జునరాయల్ దంపతుల కుమారుడు ప్రేమ్‌సాయిదేవాన్స్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం సదుం మార్గంలోని లక్ష్మీ వద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు అంతకుముందు భవిత పాఠశాలలో ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లల మధ్య కేకు కటిచేసి పుట్టినరోజు సంబరాలు జరుపుకున్నారు అనంతరం పిల్లలకు మిఠాయిలు పండ్లు పంచిపెట్టారు. తమ బిడ్డ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు ఒపూట కడుపునింపాలని ఈకార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్ రెడ్డి పాలనలో స్వర్ణ యుగం

**– ఎమ్మెల్యే డా॥ సుధ**

**అట్లూరు, జనవరి 06 ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రాబోవు రోజులలో స్వర్ణ యుగం అవుతుందని ఎమ్మెల్యే డా॥ సుధ అన్నారు. శుక్రవారం అట్లూరు స్త్రీ శక్తి భవనంలో నూతనంగా మంజూరైన 67 పింఛన్‌లను అందజేయడం జరిగింది. 2500 రూపాయలు ఉన్న పింఛన్‌ను ఇటీవల 250 రూపాయలు పెంచి 2750 రూపాయలు వంతున అందజేసి చెప్పిన మాట ప్రకారం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారులలో సంక్రాంతి పండుగ వాతావరణం సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రమాదేవి, ఎంపీడీవో సుజాతమ్మ, తహసీల్దారు శ్రీవాణి, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అందూరు రామకృష్ణారెడ్డి, రొండా మాధవరెడ్డి, గోపిరెడ్డి పాఠశాల కరస్పాండెంట్ పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, పోతిరెడ్డి రెడ్డెయ్య, నాగ సుబ్బారెడ్డి, చిన్నప రెడ్డి తదితర వైసీపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యేడాది క్రితం మంగళమిట్టలో దోచుకొన్న నగలు స్వాధీనం

**ఇద్దరు నిందితులు అరెస్ట్**

**రాజంపేట అర్బన్, జనవరి 6 ప్రభాతవార్త**



యేడాది క్రితం రాజంపేట పట్టణంలో ఓ ఇంటిలో దోచుకొన్న నగలను, ఇద్దరు నిందితులను అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. రాజంపేట డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి శుక్రవారం అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల మేరకు గత యేడాది మార్చి 2న పట్టణంలోని మంగళమిట్టలో గోనిగుంట్ల ఇందిరమ్మ ఇంటిలో దొంగలు దోచుకొన్నారు. ఇంటిలోని లక్షల విలువ చేసే బంగారు నగలును దోచుకెళ్లారు. ఈ మేరకు ఇందిరమ్మ బంగారు సరుడు, నెక్లెస్, నల్లపూసల దండ, చెంపసవరాలు చోరీకి గురైనట్లు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేశారు. చిత్తూరు జిల్లా పాకాల మండలం కార్వేటినగరం గుండు గురుస్వామికి చెందిన పి.సుబ్రమణ్యం, తిరుపతి పట్టణం ఎంఆర్‌పల్లె ప్రాంతంలోని రిక్షా కాలనిలో నివాసం ఉంటున్న జేసుదాసు జయప్రకాష్‌లు మంగళమిట్టలో చోరీకి పాల్పడినట్లు సమాచారం అందింది. ఈ మేరకు చిట్వేలిరోడ్డులో నిందతులను అరెస్ట్ చేసి వారివద్ద 80 గ్రాముల బంగారు నగలును స్వాధీనం చేసుకొన్నట్లు డిఎస్‌పి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ రాత్రివేళ కొత్త వ్యక్తులు కాని, అనుమానాస్పద వ్యక్తులు కాని సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో సిఐ నరసింహారావు, ఎస్ఐలు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నిందితులను పట్టుకొన్న ఎఎస్ఐ వర్మ, సుధాకర్‌రాజు, ఇద్దరు కానిస్టేబుళ్లను డిఎస్‌పి అభినందించారు.


